కలసి విడిన జోడు

శంకరయ్య సముద్రపుటొడ్డున నిలబడి చూస్తున్నాడు. సముద్రము ఆకలిగొన్న పులిలా నోరు తెరుచుకొని ఒడ్డుమీదికి వచ్చి పడుతున్నది. చేతులు వెనక్కుపెట్టుకొని ఉరవడితో వచ్చి విరిగిపడుతున్న అలలను చూస్తూ నిలబడిపోయాడు. ఆ హోరుకు అతడి గుండె దడదడలాడిపోయింది. ఉద్వేగంతో సముద్రము పొంగి పొర్లుకుంటూ పైకిలేచింది. ఆ పొంగు చల్లారటానికి గంటకుపైగా పట్టింది. చుట్టూకలయచూశాడు. గుంపులు గుంపులుగా ప్రజలు మూగి ఉన్న ఆ ప్రదేశము అతడికి నిర్లక్ష్యముగా కనబడ్డది.

రాత్రి ఎనిమిది గంటలు కావచ్చింది. శంకరయ్య చేతులు రెండూ కోటు జేబులో పెట్టుకొని బజార్ల వెంట తిరిగి తిరిగి మార్కెట్టు చేరుకున్నాడు. అప్పటికే మబ్బులు ఆకాశాన్నంతా ఆవరించుకున్నాయి. ఆతడు ఏదో ఆలోచించుకుంటూ దుకాణాల ముందఉగా మందంగా నడుస్తున్నాడు. ఒక వరస దుకాణాలు చుట్టివచ్చే సరికి పెద్దపెద్ద చినుకులతో ప్రారంభమైన వాన. జోరున కురువటము మొదలు పెట్టింది. జనమంతా దుకాణములలోకి దూరారు. శంకరయ్య కూడా ఒక దుకాణము లోకి జొరబడి గోడవారగా నిలబడ్డాడు.

వర్షం విలిచి కురుస్తున్నది. దుకాణాలలో దూరిన జనమంతా ఒక్కొక్కళ్లే చోటుచేసుకొని కూర్చోవటము మొదలుపెట్టారు. శంకరయ్య కూడా ఒక మూలగా గోడ కానుకొని కూర్చున్నాడు. అక్కడ చేరినవాళ్ళంతా మెల్లగా కబుర్లలో పడ్డారు. వాళ్ళంతా నవ్వుకుంటుంటే శంకరయ్యను కూడా అనుకోకుండానే నవ్వు వస్తున్నది. కాని అతడి మనసులో ఇంటి సంగతులు సముద్రపుపొంగులో పొంగి పోతున్నాయి. మోడులాంటి తన జీవితము చిగిర్చి పుష్పించి ఫలించిం దనుకున్నాడు. కాని ఆ సంతోషము నీటిబుడగలా మాయమయింది. స్మృతి చిహ్నాలను తనకు మిగిల్చిపోయింది. అతడి గుండెను కరకర నమిలి మింగేస్తుంది.

ఆతడి జీవితంలో జరిగిన సంఘటనలు అట్లా జరక్క ఇంకొక మాదిరిగా జరిగితే ఎట్లా ఉండేదో! కొన్నాళ్ళగా మిల్లులోనే పెద్ద ఉద్యోగము దొరికేదేమో

ఎవరు చూడవచ్చారు? కాని అట్లా జరగలేదు. మిల్లులో ఉద్యోగముమాట అటుంచి గృహకల్లోలాలతో మనసు కుంచించుకుపోయింది. ఒకనాడా పరిస్థితుల మీద వెగటుపుట్టింది

శంకరయ్య మనసు పాదరసములా పరుగులెత్తటము మొదలుపెట్టింది. గతాన్ని విస్మరించాలని అతడు ఎంత ప్రయత్నించినా మనసాగలేదు. 'ఛీ! మన సెంత పాపిష్ఠిది?' అని విసుక్కున్నాడు. కళ్ళుమూస్తే గడచిన సంగతులు ప్రత్యక్ష మయి కలత చెందిస్తాయని అతడు కళ్ళు విప్పుకొని చూడటము మొదలుపెట్టాడు. కాని కొంతసేపటికి కళ్ళు వాటంతట అవే మూతలుపడ్డాయి. మసక మసకగా గడచిన సంగతులు కళ్ళకు కట్టాయి.

అతడికి ఒంటిమీద స్పృహ వచ్చేసరికి కళ్ళు తుడుచుకుంటూ ఎదురుగా తల్లి కనబడ్డది. నాలుగు పక్కలా కలయచూచేసరికి అక్కడ తానొక్కడే కాడు. ఇలా చాలా మంది మంచాల మీద దుప్పట్లు కప్పుకొని పడుకొనిఉన్నారు. కొందరు మూలుగుతున్నారు. తన చేతుల వంక చూసుకున్నాడు. గట్టిగా పట్టీలు కట్టి ఉన్నాయి. బాధ తెలియకుండా ఉండాలని మందు యిచ్చినట్టున్నారు కాని చేతులలో నుంచి సన్నగా పోటు జివ్వుజివ్వున లాగినట్టు అనిపిస్తున్నది. చేతులమీద దృష్టి పడగానే కళ్ళవెంట నీళ్ల కారి ధారలు కట్టాయి.

అతడు పనిచేసే బట్టలమిల్లులో వారానికి పదిహేను రూపాయలు ఇచ్చేవారు ఏడాదికొకసారి బోనసూ ఇరవై గజాల బట్ట వచ్చేవి. మిల్లులో యంత్రాలు గిర గిర తిరుగుతూ ఉంటే అతడి మనసులో ఏదో సంతోషము లాంటిది పొంగులు వారేది. ఉడుకు రక్తము ఉరకలు వేసేది.

ఎప్పటిలాగే ఆనాడు కూడా అతడు రాత్రిపూట డ్యూటీలో ఉన్నాడు. పన్నెండు గంటల వరకూ చురుకుగా జాగ్రత్తగా పనిచేశాడు. తరువాత కొద్దిగా నిద్ర తూగటము మొదలుపెట్టింది. ఒకసారి మెషీను మీదికి ఒరగబోయాడు. కాని వెంటనే సర్దుకొని చన్నీళ్ళతో ముఖము కాళ్ళు కడుక్కొని పనిచేయటము మొదలు పెట్టాడు. ఒక గంట తిర్వాత మళ్ళీ నిద్రమబ్బు వచ్చింది. అతడికీసారి సర్దుకోవటానికి అవకాశము లేకుండాపోయింది. రెండుచేతులూ మరలోపడి నలిగిపోయాయి అతడు కేకలు వెయ్యటమూ అక్కడ ఉన్నవాళ్లు యజమానికి టెలిఫోనుచేసి అంబు

లెన్సులో తనను ఆసుపత్రిలో చేర్చటమూ బాధ భరించలేక తను గావుకేకలు వెయ్యటమూ అతడికి బాగా జ్ఞాపకమున్నది.

బాహ్యస్మృతి కలిగిన తరువాత తల్లిని తనచేతులను గురించి ప్రశ్నించాడు. ఆమె చెప్పలేక కన్నీరు కార్చింది. ఆ మరునాటికల్లా అతడికి తెలిసిపోయింది మోచేతుల వరకూ కొట్టేశారని బాధతగ్గినపుండు నయమయిన తరువాత శంకరయ్య ఇంటికివచ్చాడు. మిల్లు యజమాని ఒక ఏడాది జీతము పంపాడు.

అతడి కిప్పుడు చేతులు పూర్తిగా లేవు. రెండూ మొండివి. ఒకరు బట్ట కట్టాలి. ఎవరయినా అన్నము పెట్టాలి. తమ్ముడు ధోవతి కడుతున్నాడు. చెల్లెలు అన్నము కలిపి నోటిలో పెడుతున్నది. అన్నము తిన్న తరువాత చీకటిపడే వరకూ వాకిటి అరుగుమీద కూర్చునేవాడు. ఆలోచనలు సుడులు తిరుగుతుంటే పట్టపగలు కూడా అతడి కంటిముందర కటికచీకటి తాండవించేది

ఇంతవరకూ తల్లీ తండ్రీ చాలా ప్రేమతో గౌరవంగా అతడిని చూస్తూ వచ్చారు. కాలచక్రము దొర్లిపోతున్నది. అతడి గాయాలు పాతబడిపోతున్నాయి. తల్లిదండ్రుల సానుభూతి కూడా క్రమంగా మాటుమణిగి పోతున్నది

అంతవరకూ ఇంట్లో ఏం జరుగుతున్నదో ఏం జరిగిందో అతడికి తెలియదు అప్పుడప్పుడు తల్లీదండ్రీ ఘర్షణపడుతూ ఉంటారు. తండ్రి ఎంతసేపటికి తగవును సాగదీస్తూనే ఉంటాడు. రాత్రిళ్లు నిద్రపట్టేవరకూ నోరు మెదుపుతూనే ఉంటాడు. అది అలవాటే కనుక శంకరయ్య అంతగా మనసు పట్టించుకోలేదు. కాని ఆనాటి ఘర్షణ తీవ్రరూపము దాల్చిందనే చెప్పాలి.

"నేను సంపాదించినన్నాళ్లు నీవూ నీకొడుకులు తిన్నారు. ముసలితనములో నాకు కానీ యిచ్చేవాళ్లలేరు. చిన్నవాడి జీతంలోంచి ఓ రూపాయివ్వు" తండ్రి గద్దించి అడుగుతున్నాడు.

"ఎక్కడిదయ్యా డబ్బు? శంకరయ్య బోనసుతో పిల్లపెళ్లి అయిందనుకుంటున్నావా? పెళ్ళిబాకీలు చిన్నవాడిజీతంలోనే తీరుతున్నాయి". తల్లి పనిచేసుకుంటూనే జవాబిచ్చింది.

తండ్రికి ఎక్కడలేని కోపం వచ్చింది. ఆమె జుట్టుపీకుతూ' ఆ మొండి వాడికి కమ్మగా వండిపెట్టగలవా? నాకో రూపాయ చుట్టపీకలకిస్తే తప్పొచ్చిందా?' అంటూ అరుస్తున్నాడు.

తల్లి మీద చెయ్యిచేసుకుంటున్నాడేమో తండ్రి- అడ్డము పోదామని లోపలికి వెళ్ళుతున్న శంకరయ్యకు తండ్రి అనే చివరి మాటలు వినబడ్డాయి. అతడి గుండె మీద చమ్డాతో కొట్టినట్లయింది. త్రాణలేని అతడు మనసు ముందు వెనుకలు చూసింది. ఎటు చూసినా గాఢతిమిరము. అగాధము. కళ్ళనీళ్ళు గిర్రున తిరిగాయి. చప్పున అతడు వెనక్కు తిరిగాడు. అరుగుమీద కూర్చొని ఆలోచనలో పడ్డాడు. ఇంక ఇంట్లో ఒక్కొక్కరే తన నంత భారంగా ఎంచుకుంటారన్నమాట. తండ్రి సంగతి తెలిసిపోయింది. మరునాడు తమ్ముడుకూడా ఆ మాట అనవచ్చు. ఇకపోతే తల్లి. ఆమె తన నోటిమీదుగా అనకపోయినా సమర్థించలేదు. తన బ్రతుకెంతకు దిగజారిపోయింది. చప్పున శంకరయ్య లేచి నిలబడ్డాడు. అడుగులు ముందుకు పడ్డాయి. మెల్లగా నడకసాగింది.

అతడు నడిచి నడిచి నడిరాత్రివేళవరకూ ఒకచెట్టు దగ్గరికి చేరుకున్నాడు. ఆరాత్రి కక్కడ కళ్ళుమూసుకొని తెల్లవారగానే మళ్ళీ బయలుదేరాడు. అతడికి తన గమ్యస్థానము తెలియదు. కాని తెలిసినట్టుగానే తడబాటు లేకుండా గబగబా నడిచిపోతున్నాడు.

మధ్యాహ్నము పన్నెండు గంటలు కావచ్చింది. వైశాఖమాసపుఎండలు మండిపోతున్నాయి. వడగాడ్పు ఈ చెవి నుండి ఆ చెవికి దూసుకుపోతున్నది. శంకరయ్య ఆకలిచేత డస్సిపోయాడు. నీరసంచేత కాళ్లు తడబడుతున్నాయి, దాహంచేత నాలుక పిడచకట్టుకుపోయింది, తన అభిమానాన్ని చంపుకొని ఆ ఊరంతా తిరిగి తిరిగి ఓ యింటి ముందర ఆగి పట్టెడన్నం పెట్టమన్నాడు. అయిదు నిమిషాల తరువాత విస్తట్లో అన్నము పెట్టుకొని ఒక యిల్లాలు బయట నిలబడ్డది అన్నపువిస్తరి చూడగానే అతడి కళ్లు ఆనందంతో మెరిసిపోయాయి. చూస్తూ నిలబడి పోయాడు.

'అబ్బ! విస్తరిపట్టుకో అట్లా చూస్తావేం?' అన్నదామె ఆమె హెచ్చరికతో ఈ లోకానికి వచ్చాడు. మొండిచేతులతో విస్తరిని గుండె కానించుకొని బయలు

దేరాడు. చల్లదనానికి పక్షులు చెట్లమీదికి చేరిన ఆ మండుటెండలో అతడొక చెట్టు కిందికి చేరాడు. కూర్చుని ఆ విస్తరిని మెల్లగా నేలమీద ఉంచాడు అతడికి కడుపులో ఆకలి మండిపోతున్నది. ఇన్నాళ్ళనుంచీ లేని సమస్య ఒకటి వచ్చిపడ్డది. ఆ విస్తట్లో ఉన్న అన్నము తన నోటికి వచ్చేదెట్లా? అనుకుంటుండగా నవ్వు వచ్చింది. చప్పున నేలమీద బోర్లాపడుకొని విస్తట్లో నోరుపెట్టి గబగబా ఆ అన్నమంతా తినేశాడు. తింటూ ఉండగా గొంతు పట్టినట్లయింది. దగ్గరలో నీళ్ళు లేవు. ఉన్నా తాగటము ఒక సమస్య.

అతడు అన్నము తింటుండగా ఎవరో నవ్వినట్టు వినబడ్డది. కాని అతడు అన్నము తినే ధోరణిలో సరిగా వినిపించుకోలేదు మళ్ళీ అటువంటి నవ్వే వినబడితే వెనక్కు తిరిగి చూశాడు. అక్కడికి పది బారల దూరాన పదిహేడు పద్దెనిమిదేండ్ల పడుచు నీడలా తన వైపుకు తరలిరావటము అతడికి కనబడ్డది. ఆమె దగ్గరికి రాగానే ఆశ్చర్యముతో 'నీ కాళ్ళ కేమయింది?' అంటూ అతడు కళ్ళు పెద్దవి చేసుకుని అడిగాడు.

'నీ చేతుల కేమయింది?' అన్నదామె కళ్ళు చిన్నవి చేసుకుంటూ ఆదుర్దాగా. ఇంచుమించుగా ఇద్దరూ ఒక్కసారే ఒకరినొకరు ప్రశ్నించుకున్నారు

ఆమె తన చేతులకేసి చూస్తూ ఉండటమువల్ల అతడికి మళ్ళీ మనసులో బాధ బయలుదేరింది. అయినా ఆమె కాళ్ళవంక చూడటము మానలేదు. కొంతసేపటికి అతడు తెప్పరిల్లుకొని 'ఆ సంగతి తరువాత చెప్తా. నాకు దాహమవుతున్నది. మంచినీళ్ళు తాగిస్తావా?'

'నీళ్ళేవి?'

'దగ్గరలో ఎక్కడయినా ఉన్నాయేమో?'

'చూదాం పద'

అతడామెను నిలువెల్ల మరొక్కసారి చూశాడు.

అది గ్రహించి ఆమె 'తొందరగా పోవాలంటే నేనురాలేను నా సంగతి చూస్తున్నావుగా?' అన్నది.

'నీవు తప్పుపట్టుకోకపోతే నా బుజాల మీద ఎక్కించుకుని తీసుకుపోతాను వస్తావా?'

ఆమె కొంచెము సందేహించింది. 'నాలుక పిడుచకట్టుకుపోతున్నది. సందేహించకు మరి' అంటూ అతడు మళ్ళీ హెచ్చరించాడు. ఆమె తలవంచుకొని వెలుగులాంటి నవ్వు నవ్వింది. నేల మీదికి ఒంగి శంకరయ్య ఆమెను బుజాల మీద కూర్చోబెట్టుకున్నాడు. సిగ్గుతో ముడుచుకొనిపోతూ అతడికి ఆమె దారి చూపిస్తున్నది, ఆమె చెయ్యి చూపించినట్లల్లా అతడు నడచాడు. చింతతోపు అవతల ఉన్న ఒక సన్నటివాగు మెరుస్తూ మెలికలు తిరిగి తాచుపాములా పరుగెత్తుతున్నది. శంకరయ్య వాగు ఒడ్డున ఆమెను దించాడు. ఆమె చేతులతో పాకుతూ వెళ్ళి ఆ సెలయేటి నీళ్ళు దోసిళ్లతో అతడికి తాగించింది. అతడు ఒడ్డెక్కుతుంటే ఆమె కూడా కడుపునిండా నీళ్ళు తాగింది.

'ఆ చెట్టు నీడన కాసేపు కూచుందాము' అంటూ అతడు ముందుకు నడిచాడు. అతడు దిక్కులు చూస్తూ నడుస్తుండగా ఆమె కాసేపటిలో చెట్టు క్రిందికి చేరుకుంది.

"అయ్యో నా మతిమరుపు చూడు, ఇసుకనేలన నీచేతులు కూరుకుపోతుంటే చూస్తూ ఊరుకున్నాను గాని నిన్ను ఎత్తుకురావాలని తోచలేదు. ఎంత పొరబాటు?" అతడు రెండు చేతులతో తలపట్టుకొని ఎంతోసేపు బాధపడ్డాడు.

"ఈ కాస్త దూరానికేనా అంత నొచ్చుకుంటున్నావు? ఇంకా ఇంత దూరము కూడా నా కలవాటే" ఆ దగ్గరలో ఒక బండ చూసుకొని దులుపుకొని కూర్చున్నదామె. శంకరయ్య చుట్టూ ఉన్న చెట్లవంక చూస్తూ మధ్య మధ్య ఆమె ముఖము కేసి చూస్తున్నాడు. ఆమె శరీరము నల్లగా బొద్దుగా నిగనిగలాడిపోతున్నది చందమామలాంటి ముఖము చారడేసికళ్లు కొనదేరిన ముక్కు సొట్టపడిన గడ్డము ఒకసారి చూస్తే మరపురాని సోయగము. ఆమె యవ్వనము అతడి ఉడుకురక్తాన్ని గిలకొట్టింది. అతడట్లా తనను చూస్తుంటే ఆమెకు సిగ్గు ముంచుకువచ్చింది. అతడి దృష్టి ఆమె కాళ్ళమీద మళ్ళీ పడ్డది.

"అయితే నీ కాళ్ళు ఇట్లా ఎందుకయినాయి?"

"పుట్టినప్పుడే ఇట్లా ఉన్నాయి".

పేరు అడిగితే సత్తి అని చెప్పింది.

"మెడకు నల్లపూసలు కట్టుకున్నావు పెళ్ళయిందేమిటి?"

"అవును."

తరువాత ఏమనడగాలో శంకరయ్యకు తోచలేదు. కొంతసేపటికి అయితే "నీవా చెట్టు కింద ఏం చేస్తున్నావు?" అన్నాడు.

"ఏం లేదు. నిన్న సాయంత్ర మనగా వచ్చాను, రాత్రి అక్కడే కొంగు పరచుకొని పడుకున్నా".

శంకరయ్య ధైర్యము తెచ్చుకొని అడిగాడు "నీ యిల్లెక్కడ? అక్కడి కెందుకు వచ్చావు?"

ఆ మాటతో సత్తి తల మళ్ళీ దించుకుపోయింది. ఆలోచిస్తూ కాసేపు ఊరకుని మళ్ళీ హెచ్చరించాడు శంకరయ్య.

"మా చెల్లిని బావకిచ్చి చేశారు. దాని పెళ్ళిలోనే నాక్కూడా అతడిచేత పుస్తె కట్టించారు.........."

"అదేమిటి?"

"మరి నన్నెవరూ చేసుకోలేదు. పెళ్ళికాలేదనుకోకుండా బావచేతే పుస్తె కట్టించారు."

"అయితే నీ విప్పుడు ఎక్కడున్నావు?"

"మా అమ్మ దగ్గరే ఉన్నా. అమ్మ ఫ్యాక్టరీలోకి కూలికిపోతే ఇంట్లో పనంతా చేసి వండి పెడతా."

"మరెందుకు వచ్చావు చెట్టు కిందికి?"

సత్తి తలవంచుకుంది. ఆమె కన్నీళ్ళు జలజల రాలి ఇసుకలో ఇంకిపోయాయి. ముఖము పైకెత్తి ఆమె కళ్ళు తుడవాలనుకున్నాడు. చప్పున తనచేతుల సంగతి జ్ఞాపకమొచ్చి వెనక్కు తగ్గాడు.

"నీ కంత బాధ కలిగించేదయితే అడగనులే. పగటిపూట అన్నము తినేటప్పుడు నిన్ను చూడలేదు. చూస్తే ఆ అన్నమంతా నేను ఒక్కడినే తింటానా? నాతప్పు నాకు తెలిసినప్పటి నుంచి మాచెడ్డ బాధగా ఉంది."

నన్ను చూస్తే నీకు బాధెందుకు? అసలు విన్నటి నుంచి నాకు తిండి మీద అయిష్టత పుట్టింది. ఎందుకో తెలుసా? మాబావ చెల్లిని తీసుకుపోవాలని వచ్చాడు. పప్పుచారు, మసాలా కూరా నేను వండాను. వెలుగుండగానే అంతా నవ్వుతూ పేలుతూ తిన్నారు. ఆ సంబరములో అమ్మయినా నేను తిన్నదీ లేనిదీ అడగలేదు. మాబావ రాకతోటే కుంగిపోయిన నా మనసు దాంతో మరీ కుంగింది. చిన్నా పెద్దా కలిసి నీఖర్మ అన్నట్లనిపించింది. ఇంట్లో ఉండలేకపోయాను.'' ఆమె కన్నీరు కార్వటము మొదలుపెట్టింది.

శంకరయ్య మనసు నీరయిపోయింది. అతడికి కూడా కంట్లో నీళ్ళువచ్చాయి ఆమె దగ్గరగా జరిగి ''ఏడిస్తే లాభం లేదు. నీవు కూడా బతకటం నేర్చుకోవాలి. నా సంగతి విన్నావా? సంపాదించినన్నాళ్ళు ఇంట్లో అందరూ గౌరవించారు. అవిటి. వాడిని కాగానే అందరికి బరువయ్యాను. ఇల్లు బయలుదేరి మూడురోజులయింది అప్పటికి ఇప్పుడు తిన్నాననుకో.''

సత్తి తడికళ్ళతో అతడి ముఖంలోకి చూసింది.

''నే నో మాట చెప్తా. తప్పు పట్టుకోవు గదా?''

ఏమిటన్నట్టుగా చూసింది సత్తి తల ఎత్తి.

''నీవు మళ్ళీ యింటికి వెళ్ళదలచుకున్నావా?''

లేదన్నట్టుగా సత్తి తల తిప్పింది.

''చూడు సత్తీ నీకు కాళ్ళు లేవు. నా చేతు లెట్లా ఉన్నాయో చూస్తున్నావుగా. నిన్ను నా మెడమీద కూర్చోబెట్టుకుని ఎంత దూరమయినా తిప్పుతా. నాకింత అన్నం నోట్లోపెట్టు. మనిద్దరం కలిసి బతుకుదాం. ఏమంటావు?''

సత్తి తల వంచుకుని నేలమీద పుల్లతో గీతలు గీస్తున్నది ''ఏమంటావు చెప్పు?'' అన్నాడు.

ఆమె ఓరకంట చూసి ముసి ముసి నవ్వులు నవ్వింది.'అయితే పోదాంలే.'

''ఎక్కడికి?''

''ఎక్కడికయినా పోదాం.''

ఆమె జాలిగా అతడి కళ్ళలోకి చూసింది. అతడు నేలమీదికి ఒంగి ఆమెను మెడమీదికి ఎక్కించుకున్నాడు వచ్చిన దారి కాక మరొకదారి పట్టాడు.

దారి పొడుగునా సత్తిని మాట్లాడించాలని శంకరయ్య ఎన్నో కబుర్లు చెప్పాడు. ఎనిమిదవ క్లాసువరకూ తాను చదివిన చదువంతా ఉపయోగించి ఆమెకు తెలియని విషయాలెన్నో చెప్పాడు. తప్పుపోయినా మంచి రాగములో పదాలెన్నో పాడాడు. సత్తి మౌనంగా వింటూ కూర్చున్నది. అతడు మాత్రము ఇనుమడించిన ఉత్సాహముతో అడుగు గబగబా వెయ్యటము మొదలు పెట్టాడు. రాత్రి తొమ్మిది గంటల పొద్దుకు ఒక దేవుడి గుడిదగ్గర సత్తిని దింపి శంకరయ్య లోపలికి వెళ్ళాడు. పూజారి రెండరటి పళ్ళూ, ఒక కొబ్బరి చిప్పా అందరితో పాటు శంకరయ్యకూ పడేశాడు. అతడు వాటిని మొండి చేతులతో గుండె కదుముకొని సత్తి చేతికిచ్చాడు. తిని ఇద్దరూ బయలు దేరారు.

అది వెన్నెలరాత్రి. పాలు పుక్కిలించినట్టున్నది ప్రకృతి. శంకరయ్య సత్తిని తీసుకుని ఒక చెట్టు క్రిందికి వచ్చాడు. శంకరయ్య బుజాలమీది రుమాలు తీసి సత్తి నేలమీద పరచింది. చల్లగాలి మందంగా వీస్తున్నది. ఆకాశం మీద పట్టిన మబ్బు తునకలు అనేక రూపాలలో పరుగులెత్తుతున్నాయి. శంకరయ్య సత్తికి దగ్గరగా కూర్చుని మళ్ళీ కబుర్లు చెప్తున్నాడు. తను పనిచేసిన మిల్లులో దారము దగ్గరనుంచి బట్ట తయారయే వరకు వివరించాడు. ఆమె కళ్లు పెద్దవి చేసుకుని వింటున్నది. అయిదు నిమిషాల మౌనము తరువాత శంకరయ్య పురుషుడయినాడు. అతడిని చూసి ఆమె స్త్రీ అయింది. పొడిమాటలతో 'నేను నీ వాడిని' అన్నాడు శంకరయ్య సత్తి కళ్ళలోకి చూస్తూ.

సత్తి ఓరకంట చూసింది. ఆమె పెదవులు గులాబి మొగ్గ విచ్చుకున్నట్టు విచ్చుకున్నవి. ఏదో మాట్లాడబోయింది. కాని గొంతు మూగబోయింది.

దేవాలయంలో ఉన్న పొగడ చెట్టు కమ్మని తావులను విరజిమ్ముతూ పూలను కూడా రాల్చింది. ఆ వాసనలకు ఉక్కిరి బిక్కిరి అవుతూ చుక్కల రాజు సాక్షిగా సత్తి మైమరచి నిద్రించింది.

తెల్లవారి లేచి మళ్ళీ బయలు దేరారు. రాళ్ళనక - ముళ్ళనక శంకరయ్య నడిచి పోతున్నాడు - సత్తిని బుజాలమీదికి ఎక్కించుకుని. కొద్ది దూరములోనే

ఊరు తగిలింది. ప్రతి నాలుగిళ్ళ మధ్య ఒక హోటలున్నది. చెత్త కుండీ దగ్గర పిల్లలూ పెద్దలూ ఎంగిలాకుల కోసము తగాదా పడుతున్నారు. ఎంతసేపు నిలబడినా శంకరయ్యకూ సత్తికీ ఏ హోటలులోనూ తినుబండారాలు దొరకలేదు. హోటలులో నుంచి బయటికి వచ్చిన ఒకాయన నా సంచి స్టేషన్ వరకూ తీసుకువస్తే బేడ యిస్తానన్నాడు. శంకరయ్యకు బేడ మీద లక్ష్యంలేదు. ఎంత దూరమయ్యా స్టేషను అన్నాడు. అతడు దారి చూపుతూ సంచి చేతి కివ్వబోయాడు. శంకరయ్య వెనక్కి తగ్గి తన చేతులు చూపించాడు.

అతడు వెళ్ళిన దారినే నడుస్తూ శంకరయ్య స్టేషను చేరుకుని సామాన్లు తీసుకుని పరుగెత్తి కూలీలతో వెళ్ళి జనసమ్మర్దం బాగా ఉన్న డబ్బాలో ముందు సత్తిని ఎక్కించి తనూ ఎక్కాడు. రైలు సాగింతరువాత ప్రయాణికులంతా సర్దుకొని కూర్చున్నారు. శంకరయ్య జంకుతూనే సత్తిని వారగా ఒక బెంచీ మీద కూర్చోబెట్టాడు. కొంతసేపు నిలబడ్డ తరువాత తనుకూడా సత్తి పక్కనే సర్దుకున్నాడు.

చెట్లూ పొలాలూ గట్లూ గబగబా వెనక్కి పోతుంటే రైలు రయ్యిమంటూ ముందుకు పరుగెడుతున్నది. ప్రయాణికులంతా ప్రతి స్టేషనులోనూ ఏదో ఒకటి కొనుక్కొని తినటము మొదలు పెట్టారు. ఒక ముసలివాడు దగ్గుతూలేచి అరటి పళ్ళుకొన్నాడు. తాను రెండుతిని 'ఈ పిల్లకు ఏమీ కొనిపెట్టనా?' అని శంకరయ్యను అడిగాడు. సత్తి నాకేమి వద్దంది. సత్తి ఎందుకు అట్లా అన్నదో శంకరయ్య గ్రహించి నవ్వుకున్నాడు. ఆ ముసలివాడు రెండు పళ్ళు సత్తి చేతిలో పెట్టాడు. అభిమానము కొంత - బిడియము కొంత సత్తిని తిననీయక పోయినాయి. శంకరయ్య గ్రహించి కనుసైగ చేసాడు. సత్తి శంకరయ్య నోటికి ఒకటి అందించి తానొకటి తిన్నది.

బాత్ రూముకు పోతూ వస్తూ ఒక నడియీడు ప్రయాణికుడు శంకరయ్య చేతులు చూశాడు. మెల్లగా దగ్గరికి పిలిచి ఏమయిందని అడిగాడు. శంకరయ్య అంతా చెప్పింతరువాత 'బొంబాయిలో ఒక ఆసుపత్రి ఉన్నది. అక్కడ రబ్బరు చేతులు పెడతారు. అవి పెట్టించుకుంటే ఏవైనా తేలిక పనులు చేసుకోవచ్చు.' అన్నాడు.

"డబ్బు కావద్దూ? రబ్బరు చేతులు ఊరిక వస్తాయా?" అన్నాడు శంకరయ్య ఆశ్చర్యముతో

"పేదవాడనని డాక్టర్లకు చెప్పుకో. బీదవాళ్ళకు ఊరికేనే పెడతారు. నేను చూశాను" అన్నాడు.

శంకరయ్య అతడి చేత అడ్రసు రాయించుకుని చొక్కాజేబులో పెట్టించు కున్నాడు. ప్రయాణీకులందరు ఒక్కొక్కరే శంకరయ్యను పిలిచి-అతడి చేతులు ఎట్లా నలిగిపోయాయో అడిగి తెలుసికొన్నారు జాలిపడ్డారు.

రైల్లో ఉన్నంతసేపూ శంకరయ్యకూ సత్తికీ ఎవరో ఒకరు తినడానికి ఏదో ఒకటి యిస్తునే ఉన్నారు. శంకరయ్య అనుకున్నట్లుగా ప్రయాణీకులు మాకేం పట్టిందన్నట్టుగా లేరు. రాత్రివేళ శంకరయ్య కూర్చునే కునికిపాట్లు పడ్డాడు. సత్తి స్థలము దొరికినంతలో బాగానే నిద్ర పోయింది. మరునాడు చాలా మంది ప్రయాణీకులు దారిలో దిగి పోతున్నారు. శంకరయ్యకూడా సత్తితో వెనుక తలుపు గుండా దిగిపోయాడు. సత్తీ శంకరయ్యా బొంబాయి వీధులన్నీ తిరిగి పట్టణమంతా చూశారు. పెద్దపెద్ద దుకాణాల ముందర నిలబడి అడుక్కుని, డబ్బు సంపాదించి కడుపు నింపుకున్నారు. ఆసుపత్రి వెదికి తెలుసుకునే సరికి నాలుగురోజులుపట్టింది. ఆ జంటకు. పెద్ద డాక్టరుతో తనగోడంతా చెప్పుకుని శంకరయ్య కళ్ళ నీళ్ళు పెట్టు కున్నాడు, చేతులు పెట్టిన తరువాత అక్కడే ఒకచప్రాసీ పని యిప్పించమన్నాడు. శంకరయ్య కథంతా విన్న తరువాత ఆయన గుండె కరిగిపోయింది.

మరో పదిహేను రోజులకల్లా శంకరయ్య రబ్బరుచేతులు పెట్టుకుని అక్కడ చప్రాసీ పనిచేయటం మొదలుపెట్టాడు. ఒక గదిలోనుంచి మరో గదిలోకి కాగితాలు తీసుకుపోవటము, రోగులను ఒకవార్డునుంచి ఇంకొకవార్డుకు వెంటబెట్టుకు పోవటము లాంటి తేలికపనులు చేస్తున్నాడు. ఆసుపత్రి ఆవరణలో ఒక గది ఇచ్చారు. సత్తితో కాపరము పెట్టాడు. పనిచేసి ఇంటికివచ్చి సత్తి పెట్టిన అన్నం తిని కాస్త ఊసులాడి మళ్ళీ పనిలోకి వెళ్ళేవాడు.

సత్తికి కాళ్లు అసలు లేకపోలేదు. జానెడు పొడుగు మెలికలు తిరిగి సన్నగా ఉన్నాయి. వాటిని చెక్కితేగాని కొయ్యకాళ్ళు పెట్టటానికి వీలులేదన్నారు. అందుకు, సత్తి ఒప్పుకోకుండా వచ్చింది. శంకరయ్యకు ఆసుపత్రిలో పనిచేస్తున్నంసేపూ

ఏదో విధంగా పొద్దు గడిపేది. ఇంటికివచ్చి సత్తి కాళ్ల చూడగానే ప్రాణము చివుక్కుమనేది సత్తిని గురించిన ఈ బాధ అతడికి తను చేతులు పెట్టించుకున్న తరువాత మరీ ఎక్కువయింది.

'నేను మాత్రం యిలా రబ్బరుచేతులు పెట్టుకుని కులకనా చెప్పు సత్తి? నీ కాళ్ల అట్లా ఉంటే నా మనసెట్లా ఉందనుకున్నావు? నే చెప్పినట్లు కాళ్ల పెట్టించుకోవు సత్తీ అని బ్రతిమిలాడేవాడు. అతడి మాటలకు సత్తి' జవాబిచ్చేదికాదు, కాని కాసేపటిలో అతడి విచారము పోగొట్టేది. తన తెలివంతా ఉపయోగించి రుచిగా వంటచేసి శంకరయ్యకు అన్నము తినిపించేది. నాకు చేతులున్నాయిగా వాటితో చంచా పట్టుకుని తింటా'నని ఎప్పుడయినా శంకరయ్య అంటే నాచేతులతో అన్నం పెట్టాలనేగా నీతో వచ్చింది అనేది. అట్లాంటి సమయాలలో శంకరయ్య నేలకు ఒంగి ఆమెను గుండెకు అదుముకునేవాడు.

ఆ నెలలో ఆసుపత్రిలో ఆడనౌకరు పని ఖాళీ అయింది. ప్రయత్నముచేసి సత్తి తనకాపని యిప్పించమంది. శంకరయ్య వద్దంటే వద్దన్నాడు.

'ఎందుకు? నేనూ పనిచేస్తే డబ్బు వస్తుందిగా' అన్నది సత్తి కోమలంగా.

'నేను తెచ్చేది చాలు. నీవు యింట్లో ఉండు' అన్నాడు

'ఆపని కష్టమైంది కాదని అంతా అంటున్నారు. పోనీ చేస్తే ఏం?.'

'వద్దు సత్తి! చెప్పినట్టు విను '

సత్తి చిన్నబుచ్చుకుంది. మనసులో ఏవేవో ఆలోచనలు మెదిలాయి.

ఆసుపత్రిలో పెద్దడాక్టరు గారికి శంకరయ్యంటే అభిమానము. ఆయనే స్వయముగా అతడికి చేతులు పెట్టాడు. శంకరయ్యను చూసి తన పంట పండినట్టు మురిసేవాడు. శంకరయ్య చేతులు కోటు జేబులో పెట్టుకుని జింక లాగ ఆసుపత్రి అంతా తిరుగుతూ ఉంటే తనగది గడపమీద కూర్చుని సత్తి విస్మయముతో కళ్ల విప్పి చూసేది. అతడు సంపాదించిన పలుకుబడికి ఆశ్చర్యపడేది. తెలియని వాళ్ళెవరయినా అతడెవరని అడిగితే మూతి తిప్పుకుంటూ 'నాకేంకాదు.' అనేది.

నిండుచేతుల కోటు తొడుక్కొని తెల్లటి లాగు పాపోసులూ ధరించి ఠీవిగా తిరిగే చప్రాసీ శంకరయ్య కాళ్లలేని సత్తికి మొగుడంటే అతడికే అవ

మానము. అందరి ముందర సత్తి అతడెవరో అన్నట్టు దూరందూరంగా తిరిగేది. అతడు యింటికి రాగానే వేడివేడి అన్నము పెట్టేది. అతడు ఆవురు ఆవురుమంటూ తిని ఆనందంతో సేదదీరేవాడు.

ఈ మధ్య సత్తి కాస్త చిక్కింది. తెల్ల బడ్డది. ఎక్కడ బడితే అక్కడ కొంగుపరుచుకుని పడుకోడము మొదలుపెట్టింది. పాలిపోయిన చెక్కిళ్ళూ, దొక్కుపోయిన ముఖమూ, బావిలోంచి వచ్చినట్లుగా మాట. సత్తి గుర్తుపట్టలేకుండాఅయ్యేసరికి అక్కడ పనిచేస్తున్న ఆడ నౌకర్లంతా పనిపెట్టుకునివచ్చి దీవించి పోయారు

శంకరయ్య ముసి ముసి నవ్వులు నవ్వుతూ తనలోతాను సంబరపడుతుంటే సత్తి ఆలోచనలో మునిగి పోయేది. మనసులోమాట పైకి రానీయకుండా బిగబట్టుకుని సత్తి నెలలు రాగానే మగపిల్లవాడిని కన్నది. సంబరపడుతూ శంకరయ్య పురిటిగదిలోకి వెళ్ళాడు. కాళ్ళూ చేతులూ బాగా ఉన్నాయా లేదా అని పరకాయించి చూశాడు. తనబిడ్డకేలోపమూ లేదనుకోగానే అతడి మనసు ఊరటచెందింది. ఆనందం కొద్దీ గంతులు వేసింది. అవయవ లోపము తన చిన్నారి తండ్రికి లేదు-లేదు-లేదు. పాపాయి పండులా ఉన్నాడు. ఆ సంతోషం కొద్దీ పాపాయికి పేరుపెట్టిననాడు తోటి నౌకర్లందరికీ విందుచేశాడు. డాక్టర్లకు పండ్లూ మిఠాయి సమర్పించాడు.

సత్తి పాపాయిని ఒళ్ళో పెట్టుకుని కాళ్లు ఒకచేత్తో నవరిస్తూ పాలిచ్చేది. అలా కాళ్లు నవరించేటప్పుడు ఆమె మనసులో ఏవేవో ఊహాలు మెరిసి పిడుగుపాటులా ఉండేవి. గుండె గబగబ కొట్టుకుంటుంటే సత్తి ఆయాసపడుతూ సర్దుకునేది.

శంకరయ్య చేతులు పెట్టించుకున్న తరువాత కేంద్ర ఆరోగ్యశాఖ మంత్రి ఆసుపత్రి చూడటానికి వచ్చాడు. కాళ్ళూ చేతులూ పెట్టించుకున్న వాళ్ళందరినీ పిలిచి చూశాడు. శంకరయ్య యింటికి వచ్చి సత్తికి చెప్పాడు మురుస్తూ.

'నిన్ను కూడా కాళ్లు పెట్టించుకోమని మంత్రిగారన్నారు. కాళ్లు పెట్టించుకో సత్తీ' అన్నాడు ఎంతో బాధగా.

భోజన సమయంలో శంకరయ్యకు మంచినీళ్ళు యిస్తూ అతడిముఖంలోకి చూసింది. సత్తి తనకు కాళ్ళు లేవని అతడెంత వేదనపడుతున్నాడో గ్రహించింది

శంకరయ్య చేతులు మధ్యలో పోగొట్టుకున్నా కృత్రిమపు చేతులు పెట్టించుకుని జీవితములో తనకు కావలసినవి సాధించుకున్నాడు. తోటివారిలో అధికారులలో మెప్పుపొందుతున్నాడు.

పాపాయికి మూడవనెల నిండవచ్చింది. మనుష్యులను చూసి గుర్తుపట్టు తున్నాడు. మనిషిని చూడగానే బోసినవ్వులు ఒలకపోస్తున్నాడు.

సత్తికి రాత్రిళ్లు సుఖంగా నిద్రపట్టి వారం రోజులయింది. పాపాయిని చూసుకుని మురిసే ఆనందంలో ఒక లిప్త విషాదము - శంకరయ్య ప్రయోజకత్వము చూసుకుని పొంగే మనసులో ఏదో వెలితి ఆమె మనసు చుట్టూ సాలెగూడులో అల్లి బిగించివేస్తున్నాయి. ఆమె మనసు గిలగిల కొట్టుకుపోవటము మొదలుపెట్టింది.

ఆమె జీవితములో కాళ్ళులేని లోపము వల్ల మానసికంగా ఎన్నో బాధలు అనుభవించింది. కన్నతల్లే కడు హీనంగా చూసింది. ఇంటెడు పని చేయించేది. తోటివాళ్ళంతా నవ్వుతూ పేలుతూ ఉంటే తా నా పొయ్యి దగ్గర పొద్దంతా గడిపింది. తనను తీసుకుపోవటానికి బావవచ్చాడని చెల్లెలు మురిసిపోతుంటే తనకు తల కొట్టినట్టయింది. తనను తప్పించుకొని బావ తిరుగుతుంటే తనకేదో చెప్పలేని బాధ బయలుదేరింది. తనను చూసి అందరూ ఎంత అసహ్యించుకున్నారో తలచుకుంటే కడుపు చుట్టలు చుట్టుకుపోతుంది. అంతలో పాలకులేచిన పాపాయి మీదికి ఆమె ధ్యాస మళ్ళింది. అవును ఇప్పుడామెకు ఏలోటూ లేదు. తను గడ్డిపరక కంటె అధమము అనుకున్ననాడు శంకరయ్య ఆదుకున్నాడు. నీవూ మనిషివే నని ధైర్యమిచ్చాడు. తన లోపాన్ని అతడు అసహ్యించుకోలేడు. తనను చూడగానే వెన్నలా కరిగిపోతాడు. పాపాయి పుట్టినప్పటి నుంచీ శంకరయ్యలో మరుపుఎక్కువయింది. కానీ కాళ్ళు పెట్టించుకుంటే బాగుంటుందంటాడు. పాపాయి పెద్దవాడవకముందే పెట్టించుకోమని బలవంతం చేస్తాడు, ఒత్తిడి చేస్తాడు.

అతడి ఒత్తిడికి ఆగలేక పెనుగాలికి ఊగిపోయే సన్నటి మొక్కలా ఉంది సత్తిపని. ఆనాటి పగటి భోజనానికి వచ్చిన శంకరయ్య సత్తి ముఖంలోకి చూస్తూ "కళ్లు ముఖము వాచి పోయా యెందుకు? కంట్లోకి పొగ పోయిందా?' అన్నాడు. ఆమెతెచ్చి పెట్టుకున్న నవ్వుతో తలవంచుకుని అన్నం పెట్టింది. మామూలుగా శంకరయ్య పాపాయి మంచము మీద కూర్చుని: సత్తీ! వీడు పెద్ద చదువు చదివి

డాక్టరవాలి. ఎన్ని ప్రాణాలనో రక్షించాలి. వాడి చదువుకోసము నెలకు పది రూపాయల సర్టిఫికెట్లు కొనమని డాక్టరుగారన్నారు. ఈ నెలలోనే మొదలుపెట్టా. తీసుకో నా జేబులోంచి, అన్నాడు. సత్తి కళ్ళలో నీళ్ళు నిలిచాయి. శంకరయ్య ఆమెను సమీపించి గుండె కదుముకున్నాడు. ఆనాడు చెట్టుకింద కనబడి పెళ్ళి చేసుకోమని తనడగగానే నవ్వుతూనే కళ్ళనీళ్ళు కార్చిన సత్తి ముఖము చప్పున శంకరయ్యకు స్మృతిపథాన మెరిసింది. కాని యిప్పటికీ అప్పటికీ ఎంతో తేడా శంకరయ్యకు.

"సత్తీ పెద్ద డాక్టరుగా రేమన్నారనుకున్నావు? వీడిని బాగా అభివృద్ధిలోకి తీసుకు రావాలన్నారు. మనకున్న లోపాలు కష్టాలు వాడికి లేకుండా చేయమన్నారు. చదువుకు కావాలంటే తాను కూడా సహాయము చేస్తానన్నాడు."

సత్తి పాపాయిని చూస్తూ వింటున్నది.

"కొంత బాధపడి అయినా సరే సత్తీ! డాక్టరుగారు నిన్ను కాళ్లు పెట్టించుకోమన్నారు. చూడు సత్తీ! ఆ దొరగారు చెప్పేదేమిటంటే గుడ్డివాళ్లు, గుడ్డివాళ్ళుగాను, కుంటివాళ్లు కుంటివాళ్లుగానూ ఉండనవసరము లేదు. ఆధునిక శాస్త్రంతో అనేక ఉపాయాలు, వసతులూ ఏర్పడ్డాయి. కుంటివాళ్లు గుడ్డివాళ్ళూ అందరిలాగే ఉండవచ్చు ఈ వసతులతోటి. అప్పుడు గాని వాళ్ళకు అందరిలో గౌరవమూ మర్యాదా రాదు. ఇతర దేశాలలో ఇటువంటి విషయాలలో చాలా శ్రద్ధ తీసుకుంటారట. మనం మాత్రం ఎందుకు చేయకూడదు సత్తీ!"

సత్తి మౌనంగా వింటూ కూర్చుంది.

"మనలో మనమాటఅనుకో. నేనూ నీవంటి అవిటివాడినే. నాకేమనిపించదు. మనము యితరుల సంగతి ఆలోచించాలి. వీడే ఉన్నాడనుకో. పెద్దవాడైన తరువాత మన్ని తలుచుకుని సిగ్గుపడే అవకాశము యివ్వకూడదు."

"ఆ కాళ్లతో నేను నడవగలనా?" అన్నది సత్తి దీర్ఘంగా ఆలోచించి.

"డాక్టరుగారు చేతనయినంత ప్రయత్నం చేస్తానన్నారు."

మరునాడు శంకరయ్య సత్తిని డాక్టరు దగ్గరికి తీసుకువెళ్లాడు. డాక్టరు పరీక్ష చేశాడు. కొయ్యకాళ్లు పెట్టించుకొంటే చంకల క్రింద కర్రలు పోటీచేసుకొని నడవవచ్చునన్నాడు. మరునాడు రమ్మన్నాడు.

సత్తి యింటికి వచ్చింది. శంకరయ్య డ్యూటీలోకి వెళ్లాడు. శంకరయ్య వెళ్లిన తరువాత సత్తి మంచానికి అడ్డంగా పడుకుని కుమిలి కుమిలి ఏడ్చింది. చిన్నబోయిన ముఖంతో ఇంటిపని చక్కబెట్టుకుంది శంకరయ్య అన్నము తిన్న తరువాత తనూ తిన్నట్టుగానే గిన్నెలవీ కడిగింది. శంకరయ్య ఏదో మాట్లాడు తున్నాడు. కాని ఆమె చెవినపడటము లేదు. ఏవో ఆలోచనలు సుళ్లు తిరుగు తున్నాయి. ఆమె ఊహించుకుంటోంది - అబ్బాయి పెద్దవాడయి పెద్దచదువులు చదివి పెద్ద డాక్టరు దయవల్ల మంచి స్థితికి వస్తాడు. అప్పు డతనికి తన తల్లిని గురించి నలుగురితో చెప్పుకోవటానికి చిన్నతనముగా ఉంటుందేమో! బాధపడి పెట్టించుకున్నా కొయ్యకాళ్లు చంకలకింద కర్రలూ ఈ పనికూడా ఒక ఆపరేషను చెయ్యాలి; అదయినా ఎంతవరకూ సానుకూల మవుతుందో చేసి చూడాలట!

ఒకనాడు శంకరయ్యకు రాత్రిపూట పక్కవేస్తూ సత్తి అడిగింది. 'నా కాళ్ళు యిట్లా ఉంటే నీకు చిన్నతనముగా లేదుకదూ?' అని. ఈ మాట అనే టప్పుడు ఆమె గొంతు మామూలుగా లేదు.

శంకరయ్య నోటితో జవాబు యివ్వలేదు. లేచివచ్చి సత్తికి దగ్గరగా కూర్చుని 'ఆమాట యిప్పుడెందుకు జ్ఞాపకము వచ్చింది? ఎందుకట్లా అడుగు తున్నావు?' అన్నాడు. 'పెద్దవాళ్ళ మద్య తిరుగుతున్నావు కనుక అడిగాను. నీవు కాళ్ళతో తిరుగుతుండగా నేను ఎదురయితే నీకు బాగుండదు కదూ?'

"ఎప్పుడయినా అన్నానా! ఆమాట అయినా నీ సంగతి అందరికీ తెలుసుగా"

"ఊరికేనే అడిగా ననుకో. మనబాబు పెద్దవాడైన తరువాత - వాడికెట్లా ఉంటుంది? చదువుకుని గొప్పవాడు కాబోతున్న నీ కొడుక్కు, వాడి తల్లి యిట్లా ఉన్నదంటే నీకూ ఎట్లా ఉంటుంది?"

"అంతా బాగుంటుంది - నీవు కాళ్లు పెట్టించుకుంటే."

"పెద్ద డాక్టరుగారు నమ్మకంగా చెప్పలేదుగా, ఆపరేషను చేసి చూడా లన్నారు కదూ?"

'చూడనీ' శంకరయ్య సంభాషణ అంతటితో తుంచేశాడు.

కాలము మర్చిపోయింది. కాని సత్తి మాత్రము కన్నవారింట్లో తనకు జరిగిన భంగపాటు మరవలేదు. ఆ భంగపాటు ఆమె భవిష్యాన్ని నిలవదీసి ప్రశ్నించుతోంది. తీపి చేదులమధ్య ఆమె మనసు ముందుకూ వెనక్కూ ఊగి పోతున్నది.

ఆ మధ్యాహ్నం వేళ సత్తి పిల్లవాడిని పడుకోబెట్టి శంకరయ్య బట్టలన్నీ దులిపి పెట్టెలో పెడుతున్నది. పిల్లవాడు లేచాడు సత్తి పలకరిస్తూనే ఉన్నది. కాని పాకటము నేర్చిన పిల్లవాడు ఆగలేదు. ఇదిచూసి సత్తి జరుగుతూ పిల్లవాడిని అందుకోబోయింది అంతలో వాడు గడపదాటి మెట్టుమీదనుంచి దొర్లాడు. మెట్టు చాలా చిన్నది. కాని ఆ పాటికే పిల్లవాడు గుక్కపట్టాడు. సత్తి పిల్లవాడిని ఎత్తుకుని సముదాయించుతూండగా శంకరయ్య వచ్చాడు అంతా విని "ముందు ముందు వీడికి నడక వస్తుంది. వీడిని నీవేం పట్టగలవు. దబ్బున ఒక అడుగు వేసి వాడిని పట్టుకోగలవా ?" అన్నాడు.

సత్తి మాట్లాడకుండా తనపని తాను చేసుకు పోయింది ముక్క చెక్క అవుతున్న తనమనస్సు రాయిగా చేయాలని ప్రయత్నిస్తూ.

ఆ మరునాడుదయమే లేచిన సత్తి ఇంటి పనులన్నీ శ్రద్ధగా చేసుకుని, శంకరయ్యకు ఇష్టమయిన కూర వండింది. పాలుకొని పాయసము చేసింది. ఎప్పటి లాగే పక్కింటి ముసలమ్మచేత పిల్లవాడికి నీళ్ల పోయించింది. పెట్టెలో ఉన్న కొత్త చొక్కతొడిగింది శంకరయ్య రాగానే అన్నము పెట్టింది. అతడు డ్యూటీ లోకి వెళ్ళుతుంటే కనుచూపు ఆనేంతవరకూ గడపలో నిలబడి చూసింది. పిల్ల వాడిని ఒళ్లో వేసుకుని ఒళ్లో నిమురుతూ కడుపునిండా పాలిచ్చింది. ఉబికి 'ఉబికి వస్తున్న దుఃఖాన్ని అణచుకోలేక ఉక్కిరి బిక్కిరి అయింది. పిల్లవాడిని గుండెకు హత్తుకుంది. ముద్దులతో నలిపివేసింది. తలా బుగ్గలూ ఒళ్ళూ నిమిరి నిమిరి పడుకోబెట్టింది.

రోజూ వచ్చి పిల్లవాడికి నీళ్ళుపోసే ముసలమ్మను కేకవేయగానే వచ్చింది.

"కాస్త పిల్లవాడిని చూస్తూ ఉండు" అని బయలుదేరింది. గడపదాటి వెనక్కు తిరిగి చూడగానే బావురుమని ఏడవాలనిపించింది. ఒక్కసారి మంచము దగ్గరికి వెళ్ళి పిల్లవాడిని చేతుల్లోకి తీసుకోవాలని మనసు వేగిర పెట్టింది. అయిదు

నిమిషాలపాటు నిలబడి ఆలోచించింది. పెదవులూ గడ్డమూ దుఃఖముతో వణికి పోతున్నాయి. సత్తి నిగ్రహం తెచ్చుకుని కొంతదూరము పోయి వెనక్కు తిరిగి చూసింది. మళ్ళీ దుఃఖము పొంగింది. రాయి అయిన మనసు నీరు కారడము మొదలు పెట్టింది. ఆలోచనలు అడుగు ముందుకు సాగ నివ్వలేదు. కాని ఆమెలో నుంచి పట్టుదల ప్రజ్వరిల్లుతూ పైకి లేచింది. సత్తి తన శక్తినంతా కూడగట్టుకుని ముందుకు సాగిపోయింది.

శంకరయ్య ఆ సాయంత్రం డ్యూటీ నుంచి వచ్చేసరికి పిల్లవాడు ఏడుస్తు న్నాడు. ముసలమ్మ పట్టలేకపోతున్నది.

''ఏవయ్యా సత్తి. యిప్పుడే వస్తానని అప్పుడనగా వెళ్ళింది?''

"ఎక్కడికి వెళ్ళింది? ఎందుకు వెళ్ళింది?" శంకరయ్యకు కలవరంపుట్టింది. భూమిమీద కాలు ఆనలేదు. పిల్లవాడు గుక్కపట్టి ఏడుస్తున్నాడు. ఎలా సమాధాన పెట్టాలో శంకరయ్యకు తెలియలేదు. గబగబా వెళ్ళి గ్లాసెడు పాలు తెచ్చి ముస లమ్మ కిచ్చాడు పిల్లవాడికి పట్టుమని. ముసలమ్మ కాళ్ళమీద పిల్లవాడిని పడు కోపెట్టుకుంటే శంకరయ్య చంచాతో నోట్లో పోశాడు.

సత్తి ఎక్కడికి వెళ్ళింది? ఎందుకు వెళ్ళింది? పిల్లవాడు ఏడుపుమాని నిద్ర పోగానే శంకరయ్య తడబడుతూ ఇల్లంతా తిరిగాడు. అతడికేమీ తోచలేదు. ఆదుర్దా ఎక్కువయింది. పిల్లవాడిని చూస్తూ ఉండమని ఆ ముసలమ్మకే ఒప్పగించి బయలుదేరాడు. బొంబాయి వీథులన్నీ తిరిగి వెదకటానికి ఎంతకాలము పడుతుంది? ఎంతకనీ ఆ మహాపట్నములో వెదకటం? పోలీసుస్టేషనులో చెప్పాడు. తిండి లేకుండా ఆ రాత్రంతా తిరిగాడు. జనసమ్మర్దము తక్కువన్న మాటేగాని రాత్రిళ్లు కూడా బజార్లు సందడిగానే ఉన్నాయి. తెలతెలవారుతూ ఉండగా కాసేపు కాలిబాట మీద కూర్చున్నాడు. అతడి మనసంతా పాడుబడ్డ మఠంలా ఉన్నది. శ్యామలా కాశంలో నుండి ఒక్కొక్క చుక్క మబ్బు చాటున మరుగుపడి పోతున్నది. ఉండి ఉండి పిల్లవాడు కెవ్వు మన్నట్లు శంకరయ్య ఉలిక్కిపడుతున్నాడు.

శంకరయ్య ఎండి పోయిన పెదవులతో వాడిపోయిన ముఖంతో మళ్ళీ బయలుదేరాడు. ఏడు గుర్రాల దొర ప్రకృతి లోకి పొడుచుకుంటూ వస్తున్నాడు. శంకరయ్య దారివెంట నడుస్తూ కనబడ్డవారి నందరినీ అడుగుతూ ముందుకు సాగి

పోయాడు. మధ్యాహ్నమయింది. పచ్చి మంచినీళ్లు తాగలేదు. పొద్దు వాలి పోతున్నది.

సాయంకాలము నాలుగు గంటలనుండీ జనమంతా సముద్రపు ఒడ్డుకు చేరుతుంటారు. అక్కడే తినుబండారాలు, చిన్న చిన్న వినోదకరమయిన వస్తువులూ అమ్మకానికి వస్తాయి. జనం గుంపులు గుంపులుగా మూగి ఉంటారు. శంకరయ్య వాళ్ళను తప్పించుకుని పోతున్నాడు. అక్కడికి వంద గజాల దూరాన నీళ్ళ వైపు చూస్తున్న సత్తి కనబడ్డది. అతిడికి ప్రాణము లేచివచ్చింది.

'సత్తీ' అని కేకలు వేసుకుంటూ శంకరయ్య ముందుకు పరిగెత్తాడు. ఎప్పటి మంచో నీళ్ళ వంక చూస్తూ నిలబడ్డ సత్తి - శంకరయ్య కేక వినగానే పాకుతూ వెళ్లి నీళ్ళలో దబాలున పడిపోయింది. చూస్తూ ఉండగానే సత్తిని కెరటాలు లాక్కుపోతున్నాయి. సత్తికోసము పరుగెత్తి శంకరయ్య తాను నీళ్ళలోకి ఉరికాడు. సత్తి తలవెంట్రుకలు కనబడుతూ అలలతో పాటు పైకిలేస్తుంటే పట్టుకోవచ్చనుకున్నాడు.

'అయ్యో అయ్యో' అంటూ అందరూ అటు చూడటం మొదలుపెట్టారు. ధైర్యశాలు లిద్దరు నీళ్ళలోకి దూకారు, వాళ్ళను పట్టుకోవటానికి. వాళ్ళు ఎంత దూరముపోయినా సత్తి తలవెంట్రుకలు చేతికి చిక్కలేదు. ఈతరాని శంకరయ్య రబ్బరు చేతులు పైకెత్తుకొని కనబడ్డాడు. అతడిని ఒడ్డుకు చేర్చారు.

పదిమందీ చుట్టూమూగి ఏమిటేమిటని శంకరయ్యను గుచ్చిగుచ్చి అడిగారు. ఆదుర్దా ఆందోళన దుఃఖము పొంగి పొర్లొచ్చాయి శంకరయ్యకు. చిన్నపిల్లవాడిలా వలవల ఏడ్చాడు.

సత్తి ఎందుకు ఆత్మహత్య చేసుకుంది? ఎందుకంత సాహసానికి ఒడికట్టింది? ఏ ఉద్దేశ్యముతో పండువంటి పాపాయికి అన్యాయము చేసింది. బంగారం వంటి సంసారంలో ఎందుకు చిచ్చు లేపింది? శంకరయ్య రబ్బరు చేతుల్లో తల బాదుకున్నాడు.

శంకరయ్యను తడిబట్టలతో ఒకాయన తన కారులో యింటికి చేర్చాడు. వాన జోరు తగ్గింది. దుకాణంలో కూర్చున్న వాళ్ళందరూ ఒక్కొక్కరే లేచి వెళ్ళారు. ముంగురులతో దోబూచులాడే జాబిల్లి లాంటి పాపాయి ముఖము జ్ఞాపకానికి రాగా శంకరయ్య గృహోన్ముఖుడైనాడు